సాక్షి
మంచిర్యాల
సోమవారం। 11 । డిసెంబర్ । 2023



దీవించు తల్లీ..

కార్తీక మాసం ఆఖరు ఆదివారం కౌటాల కంకలమ్మ గుట్ట (మేదరిగిరి) పై కంకలమ్మ- కేతేశ్వర స్వామి ఆలయ 19వ మహా జాతర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. 8లో▸

ప్రశాంతంగా ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

మంచిర్యాలఅర్బన్: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలోని నాలుగు కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 856 మంది విద్యార్థులకు 835 మంది హాజరయ్యారు. 21 మంది గైర్హాజరయ్యారని డీఈవో యాదయ్య తెలిపారు.

గరిష్టం/కనిష్టం
29.4 /15.2

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా తక్కువగా నమోదవుతాయి. రాత్రి మంచు కురుస్తుంది. చలి ప్రభావం పెరుగుతుంది.

న్యూస్‌రీల్

సీఎంను కలిసిన పీఎస్సార్



సీఎం రేవంత్‌రెడ్డిని శాలువాతో సత్కరిస్తున్న కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో చేపట్టే అభివృద్ధికి సహకరించడంతోపాటు, వెనుకబడిన జిల్లాకు అధిక నిధుల కేటాయింపు, మంచిర్యాల నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు కేటాయించేలా చూడాలని కోరారు. సీఎంగా ఎన్నికైన సందర్భంగా ప్రత్యేక శుభాకాంక్షలను తెలిపారు.

'మహాలక్ష్మి'కి భారీ స్పందన

- తొలిరోజు 65,953 మంది ఉచిత ప్రయాణం

ఆదిలాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 9న ప్రారంభించిన మహాలక్ష్మి పథకానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా భారీ స్పందన లభించింది. మహిళా ప్రయాణికులు బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఆర్టీసీ రీజియన్ పరిధిలో 65,953 మంది మహిళా ప్రయాణికులు తొలిరోజు ఉచితంగా బస్సుల్లో ప్రయాణించారు. అత్యధికంగా మంచిర్యాల డిపో పరిధిలో 18,331 మంది, నిర్మల్‌లో 16,627, ఆదిలాబాద్‌లో 10,874, భైంసాలో 10,519, ఆసిఫాబాద్‌లో 5,509, ఉట్నూరు డిపో పరిధిలో 4,093 మంది పథకాన్ని సద్వినియోగం చేసుకున్నట్లు ఆర్టీసీ అధికారులు వెల్లడించారు. రాబోయే రోజుల్లో మరింతగా డిమాండ్ పెరిగే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు.

గూడెంలో రద్దీ



సత్యదేవున్ని దర్శించుకుంటున్న భక్తులు

దండేపల్లి: కార్తీక మాసం ప్రారంభం నుంచి దండేపల్లి మండలం గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతూనే ఉంది. ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సత్యదేవున్ని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు, కార్తీక దీపాలు వెలిగించారు. 427 జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నాయి. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో రద్దీగా కనిపించింది.

స్వేచ్ఛగా జీవించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధానకార్యదర్శి ప్రకాశ్

భీమారం: రాజ్యాంగం ప్రతీ పౌరునికి కల్పించిన హక్కుల్లో సమాజంలో స్వేచ్ఛగా జీవించే హక్కు ఉందని జాతీయ మానవ హక్కుల మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మదన్‌పల్లి ప్రకాశ్ అన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా భీమారం మండల కేంద్రంలో ఆదివారం జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ప్రకాశ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి తెలుసుకోవాలని సూచించారు. వ్యక్తిగత హక్కులకు ఏవరైనా భంగం కలిగిస్తే వారిపై చర్యలు తీసుకొనే అవకాశం ఉందని అన్నారు. ప్రజలకు అండగా మానవహక్కుల మండలి నిలుస్తుందని తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గుగ్లోత్ బాలాజీ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లంపల్లి నాగరాజాగౌడ్, ఉపాధ్యక్షుడు చిలుకూరి సందీప్, మహిళా అధ్యక్షురాలు సరోజ, సభ్యులు పాల్గొన్నారు.

సైకిల్ యాత్రికుడికి సన్మానం



పద్మసందేశ్‌గుప్తాను సత్కరిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: మూగ జీవాల సంరక్షణపై అవగాహన కోసం మంచిర్యాల నుంచి శ్రీశైలం వరకు 1000 కిలోమీటర్లు ఫ్రెండ్స్ యానిమల్ ట్రస్టు చైర్మన్ పద్మాసందేశ్‌గుప్తా సైకిల్‌యాత్ర చేపట్టారు. జిల్లా కేంద్రంలోని హమాలీవాడ నుంచి ఈ యాత్ర ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మాసందేశ్‌గుప్తా యాత్ర విజయవంతం కావాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ నల్లనాగేంద్రప్రసాద్, బీజేపీ నాయకులు దుర్గం అశోక్ సన్మానించారు.

ఫ్రీ జర్నీ.. వారికి దూరం!

- ఆర్టీసీ ఉచిత ప్రయాణానికి నోచుకోని గ్రామీణ మహిళలు
- జిల్లాలో చాలా పల్లెలకు బస్సు సౌకర్యం కరువు
- రోడ్లు ఉన్నా బస్సులు నడపని ఆర్టీసీ
- బస్సులు నడపాలని కోరుతున్న పల్లె ప్రజలు



కాలినడకన ఆస్పత్రికి వెళ్తున్న బోగంపల్లి మహిళలు (ఫైల్)

మంచిర్యాలఅర్బన్: కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో మహాలక్ష్మి ఒకటి. ఇందులో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం హామీని శనివారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ప్రారంభించింది. తొలిరోజు ఉచిత ప్రయాణానికి అనూహ్య స్పందన వచ్చింది. ప్రభుత్వం కల్పించిన సౌకర్యంపై జిల్లా మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇదంతా నాణేనికి ఒక వైపే.. జిల్లాలో ఆర్టీసీ బస్సు ఎరగని అనేక గ్రామాలు ఉన్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండు రోజులకే ప్రారంభించిన పథకానికి గ్రామీణ మహిళలు నోచుకోవడం లేదు. ఆర్టీసీ బస్సులు నడపకపోవడంతో తాము ప్రైవేటు వాహనాలనే ఆశ్రయిస్తున్నామని పేర్కొంటున్నారు. ఆర్టీసీ ఉచిత ప్రయాణం కల్పించినా తమకు ఎలాంటి లాభం లేదని అంటున్నారు.

రోడ్లు ఉన్నా బస్సులు నడపని ఆర్టీసీ..

జిల్లాలో ప్రధాన రహదారుల మీదుగా ఉన్న గ్రామాలకు మినహా పలు పల్లెలకు బస్సులు వెళ్లడం లేదు. రోడ్లు ఉన్నా అధికారులు బస్సులు నడపడం లేదు. తమ ఊరికి బస్సు నడపాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా స్పందించడం లేదని గ్రామీణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఫ్రీజర్నీ సౌకర్యం కల్పించినా అసలు బస్సులే తమ ఊరికి రాకపోవడంతో నష్టపోతున్నామంటున్నారు. ఇక మరికొన్ని గ్రామాలకు పాఠశాల విద్యార్థుల కోసం ఒకటి రెండు ట్రిప్పుల తప్ప పూర్తిస్థాయిలో నడిచింది తక్కువే. నూతన బస్సుల కొనుగోలు లేకపోవటం.. సిబ్బంది కొరతతోపాటు ఆదాయం లేకపోవటం.. రోడ్లు డ్యామేజీ కారణాలతో బస్సులు రద్దయ్యాయి.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో 148 బస్సులు ఉన్నాయి. రోజుకు 62 వేల కిలోమీటర్లు రాకపోకలు సాగిస్తున్నాయి. 42 వేలకు పైగా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తున్నారు. సంస్థకు నిత్యం రూ.26 లక్షలకుపైగా ఆదాయం సమకూరుతుంది. ప్రతీ గ్రామానికి రోడ్డు సౌకర్యం ఉన్నా ఏదో కారణంతో ఆర్టీసీ బస్సులను నడపించడం లేదని తెలుస్తోంది. జిల్లాలో 122 గ్రామాలకు బస్సులు వెళ్లని పరిస్థితులున్నాయి. ఆర్టీసీ ఆక్యూపెన్సీ(ఓఆర్)ఉన్న పల్లెలకే బస్సులు నడుపుతుండటంతో చాలా గ్రామాలు బస్సు సౌకర్యానికి నోచుకోవడం లేదు.



ట్రాలీలో ప్రయాణిస్తున్న కోనంపేట మహిళలు

గ్రామీణ ప్రాంతాలకు బస్సు నడపాలి...

మందమర్రిరూరల్: మండలంలోని గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు నడపాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు. మండలంలో పది గ్రామ పంచాయతీలు ఉండగా, మండల కేంద్రం నుంచి సారంగపల్లి, చిర్రకుంట, ఆదిల్‌పేట్, మామిడిగట్టు, ఆవుడం, పొన్నారం, వెంకటాపూర్ గ్రామాలకు బస్సు రావడం లేదు. గ్రామాల నుంచి మండల కేంద్రానికి, జిల్లా కేంద్రానికి చదువు కోసం వెళ్లే విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం సౌకర్యానికి మహిళలు నోచుకోని పరిస్థితి. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు నడపాలని కోరుతున్నారు.

బస్సు లేక ఫ్రీ కోల్పోతున్నాం



భీమారం: కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీబస్సుల్లో ఉచిత ప్రయాణం ఎంతో సంతోషం కల్గించింది. కానీ మాగ్రామానికి ఆర్టీసీ బస్సు లేని కారణంగా నష్టపోతున్నాం. అధికారులు ఇప్పటికైన చర్యలు తీసుకుని భీమారం నుంచి కొత్తపల్లి వరకు బస్సు నడిపించాలి.

– ఆకుదారి లావణ్య, గృహిణి, ఆరెపల్లి(భీమారం మండలం)

నష్టపోకుండా చూడాలి



భీమారం: సీఎం రేవంత్‌రెడ్డి మహిళలకు పెద్ద కానుక రూపంలో ఆర్టీసీ బస్సుల్లో ఫ్రీ ఇచ్చారు. అయితే మాగ్రామానికి ఇప్పటివరకు ఆర్టీసీబస్సు రాలేదు. బస్సు లేని కారణంగా ప్రభుత్వం ఇచ్చిన పథకాన్ని ఉపయోగించుకోలేక పోతున్నాం.

– సింగిరెడ్డి సరిత, దాంపూర్(భీమారం మండలం)

చార్జీల భారం తప్పడం లేదు



ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించినా మాకు చార్జీల భారం తప్పడం లేదు. మా గ్రామానికి ఆర్టీసీ బస్సు రాకపోవడంతో ప్రైవేట్ వాహనాలే దిక్కు అవుతున్నాయి. ఆటోల్లో కిక్కిరిసి వెళ్లాల్సి వస్తుంది. మా గ్రామానికి ఆర్టీసీ బస్సు నడిపితేనే మాకు ఉచిత ప్రయాణ సౌకర్యం లభిస్తుంది.

– చాపిడి పెంటక్క(కోనంపేట)

బస్సు సౌకర్యం కల్పించాలి..



మా ఊరికి బస్సు రాకపోవడంతో చదువుకునే పిల్లలు, ఇక్కడి మహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఉచిత ప్రయాణ సౌకర్యం పెట్టింది. కానీ మాలాంటి మహిళలకు ఏం లాభం. బస్సు వస్తే ఉచిత ప్రయాణం పథకానికి మంచి పేరు ఉంటది.

– సంద్ర సుమలత, బోగంపల్లి

నాలుగు రోజులే నడిపించారు



మా ఊరికి నాలుగు రోజులే బస్సు నడిపించారు .తరువాత బస్సే రావడం లేదు.ఆటోలు, ప్రయివేటు వాహనాలలో వెళ్తున్నాం. మాకు బస్సు నడిపించాలి. మహిళలకు ఉచిత రవాణా లబ్ధి కలిగేలా చూడాలి.

– నరిగె జానకి, కాచన్‌పల్లి

బస్సులు నడవని గ్రామాలు..

బెల్లంపల్లి నుంచి వేమనపల్లికి బస్సులు నడపటం లేదు. నక్కలపల్లి, అన్నారం, మంచిర్యాల నుంచి మందమర్రి మీదుగా భీమారం వరకు బస్సులు నడపకపోవటంతో ఆటోలు, జీపుల్లో ప్రయాణించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. బెల్లంపల్లి నుంచి భీమినికి బస్సులు నడపాలంటూ ప్రయాణికుల నుంచి విన్నపాలు వెల్లువెత్తాయి. కాసిపేట్ మీదుగా గట్రాజుపల్లికి బస్సు వేయాలని ఎప్పటి నుంచో కోరుతున్నారు. లక్సెట్టిపేట చందారం, వెంకట్రావ్‌పేట్ మీదుగా ఉదయం సాయంత్రం విద్యార్థుల సౌకర్యార్థం బస్సులు నడుస్తుండగా మరిన్ని ట్రిప్పులు పెంచాలనే డిమాండ్ ఉంది. ఆక్యుపెన్సీ రేషియో(ఓఆర్) వచ్చే ఆసిఫాబాద్, చెన్నూర్ రూట్లలో బస్సులు పెంచాల్సి ఉంది. ఒక్కో రూట్‌లో నాలుగు నుంచి ఐదు బస్సులు అవసరం ఉన్నాయి. ఇలా పలు గ్రామాలకు బస్సులు నడపాల్సి ఉంది. కొత్తబస్సులు వస్తేగానీ అన్ని ప్రాంతాలకు బస్సులు నడపటం సాధ్యం కానిదని అధికారులు చెబుతున్నారు.

కాసిపేట మండలంలో..

కాసిపేట: మండలంలోని సోనాపూర్‌కు ఆర్టీసీ బస్సు నిలిపివేయడంతో సుమారు 15కు పైగా ఆదివాసీ గ్రామాలకు బస్సు సేవలు లేకుండా పోయాయి. మంచిర్యాల నుంచి దేవాపూర్, సోనాపూర్‌కు వేర్వేరుగా బస్సులు నడుస్తుండగా మూడునెలల క్రితం సోనాపూర్ బస్సును ఆర్టీసీ అధికారులు నిలిపి వేశారు. రోడ్డు సౌకర్యం ఉన్నా ఆర్టీసీ సేవలు నిలిపివేయడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సోనాపూర్‌కు బస్సు పునరుద్ధరిస్తే ధర్మరావుపేట క్రాస్‌రోడ్, మల్కేపల్లి, రోట్టెపల్లి, వెంకటపూర్, లక్ష్మీపూర్, సోనాపూర్, బాదుగూడ, నాయకపుగూడ, దొడ్డిగూడ, సాలెగూడ, గొండుగూడ, గట్రావుపల్లి, రేగులగూడ, ఇప్పలగూడ, తుడుంగూడతో పాటు పలు గూడేల్లో ఆరువేల మంది ఆదివాసీలకు బస్సు అందుబాటులోకి వస్తుంది.

చెన్నూర్ మండలంలో..

చెన్నూర్‌రూరల్: చెన్నూర్ మండలం చాకెపల్లి, ఒతుకులపల్లి, బుద్దారం, సంకారం, కన్నెపల్లికి బీటీ రోడ్ల సౌకర్యం ఉన్నప్పటికీ ఆ గ్రామాలకు బస్సు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని కాచన్‌పల్లి, సంకారం, బుద్దారం గ్రామాలకు వెళ్లే రహదారుల్లో వాగులపై వంతెనలు నిర్మించినా బస్సు సౌకర్యం కల్పించలేదు.

బీటీరోడ్లు ఉన్నా..

భీమారం: మండలంలో దాదాపు అన్ని గ్రామాలకు బీటీ రోడ్లు ఉన్నా ఆర్టీసీ బస్సులు కరువయ్యాయి. బస్సులు నడిపించేందుకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. భీమారం నుంచి అంకుసాపూర్, ఆరెపల్లి, మద్దికల్, కొత్తపల్లి, దాంపూర్, ధర్మారం, రెడ్డిపల్లి, నర్సింగాపూర్ గ్రామాలకు ఆర్టీసీ బస్సులు రాలేదు.

నెన్నెల మండలంలో..

నెన్నెల: మండలంలోని కోనంపేట, బోగంపల్లి, పాటి, చిన్నవెంకటాపూర్, కొత్తూర్ గ్రామాల ప్రజలకు ఆర్టీసీ బస్సు కంటికి కనిపించక ఏళ్లు గడుస్తున్నాయి. దీంతో ఈ గ్రామాల ప్రజలు ఆటోలు, ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. బోగంపల్లి, పాటి, దమ్మిరెడ్డిపేట గ్రామాల ప్రజలకు వర్షాకాలంలో కనీసం నడవడానికి , ఎడ్ల బండ్లపై రావడానికి సరైన దారి లేదు.

పల్లెవెలుగు వస్తే పండుగే..

వేమనపల్లి: ఇప్పటికీ మండలంలోని మారుమూల గ్రామాలకు పల్లెవెలుగు బస్సులు అందని ద్రాక్షగానే మిగిలిపోతున్నాయి. ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం పథకానికి శ్రీకారం చుట్టగా మండలంలోని కొన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం లేకుండా ఉన్నాయి. నాగారాం, లక్ష్మీపూర్, మామిడిపల్లి, సూరారం, జిల్లెడ, జక్కెపల్లి , బుయ్యారం గ్రామాలకు బస్సులు వెళ్లడం లేదు.

భీమిని మండలంలో..

భీమిని: మండలంలోని తెనుగుపల్లి, భీంపూర్, కేస్లాపూర్ గ్రామపంచాయతీల ప్రజలకు ఆర్టీసీ బస్సు రావడం లేదు.

బస్సు ఎరుగని గ్రామాలెన్నో..

తాండూర్: మండల పరిధిలో 15 గ్రామ పంచాయితీలు ఉండగా జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న బోయపల్లి, వేణునగర్, కిష్టంపేట, తంగళ్లపల్లి, తాండూర్ ,రేపల్లెవాడ,పెగడపల్లి గ్రామాలకు మినహా మిగతా గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. గతంలో నర్సాపూర్, అబ్బాపూర్,బెజ్జాల వంటి గిరిజన గ్రామాలకు, రేచిని ,అచ్చలాపూర్ లాంటి పెద్ద గ్రామాలకు కూడా బస్సు సౌకర్యం ఉండేది. ఆటోలు పెరగడంతో బస్సులు రద్దు చేశారు.



ఆరట్టు ఉత్సవం

వల్లివేటకు వెళ్తున్న అయ్యప్ప స్వాములు...

దండేపల్లి మండలం గూడెం శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో గురుస్వామి చక్రవర్తుల పురుషోత్తమాచార్యులు ఆధ్వర్యంలో ఆదివారం ఆరట్టు ఉత్సవం వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా అయ్యప్పస్వామి వల్లివేట, జలక్రీడ, కార్యక్రమాలు జరిపించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కన్నె స్వాములు, కత్తి స్వాములు, గంట స్వాములు, గధ స్వాములు, అయ్యప్ప భక్తులు ప్రత్యేక భజనలు చేశారు.



స్వామికి అభిషేకం చేస్తున్న గురుస్వామి

అయ్యప్ప ఆలయ ప్రాంగణం భక్తుల శరణు ఘోషతో మార్మోగింది. అనంతరం స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. – దండేపల్లి

జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



పతకాలు చూపుతున్న విద్యార్థులు

బెల్లంపల్లి: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో ఈనెల 9న జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పలువురు విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. బెల్లంపల్లి, మంచిర్యాలకు చెందిన బాలబాలికలు వివిధ అంశాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని సీనియర్ కరాటే మాస్టర్ వి.రవి ప్రకటించారు. వైష్ణవి, రక్షిత, యోగిత, రిషివర్ధన్, ఎం డీ.మధికౌరర్, రిత్విక్‌తేజ, సాకేత్‌కుమార్, శ్రీహిత, అక్షయాని ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించారని వివరించారు. విజ్జగిరి క్రితిక, అవంతిక, గాయత్రి ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ పతకాలు దక్కించుకున్నారు. శ్రద్ధాధరి, విష్ణుతేజ, రాహిత్య మూడోస్థానంలో నిలిచి కాంస్య పతకాలు గెలిచినట్లు తెలిపారు.

పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



ఆరోగ్యశ్రీ పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే, ఆర్డీవో



మహిళలకు జీరో టిక్కెట్ ఇస్తున్న వినోద్

బెల్లంపల్లి: పేదల ఆరోగ్యంపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. బెల్లంపల్లి ప్ర భుత్వ ఏరియా ఆసుపత్రిలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిధిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంపు కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు ఒకటి అని తెలిపారు. పేదలు అనారోగ్యం పాలైతే ఆర్థిక ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం చిత్తశుద్ధితో ఆరోగ్యశ్రీ పరిమితి పెంచిందని తెలిపారు. అట్టడుగు వర్గాలు, నిరుపేదలు ఆరోగ్యశ్రీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మహిళల కోసం 'మహాలక్ష్మి'..

మహాలక్ష్మి పథకం మహిళలకు ఆర్థిక చేయూతను ఇస్తుందని ఎమ్మెల్యే వినోద్ అన్నారు. కాంటా చౌరస్తా వద్ద మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఆర్టీసీ బస్సు ఎక్కి మహిళా ప్రయాణికులకు జీరో టిక్కెట్ ఇచ్చి ఏఎంసీ చౌరస్తా వరకు ప్రయాణించారు. కార్యక్రమాల్లో బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత , ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్ సత్యనారాయణరెడ్డి , ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ కె.రాంచందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ మత్తమారి సూరిబాబు, టీపీసీసీ సభ్యుడు చిలుముల శంకర్, డీసీసీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి, మంచిర్యాల డిపో మేనేజర్ రవీంద్రనాథ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య, మున్సిపల్ కౌన్సిలర్ ప్రభాకర్, తహసీల్దార్ సుధాకర్, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీట్ ఆఫీసర్‌కు న్యాయం జరిగేనా?

- ఎఫ్‌ఆర్వోను కాపాడేందుకు నేతల యత్నం
- నేడు అధికారులతో యూనియన్ నాయకుల సమావేశం
- రవి, రాందాస్‌పై చర్యలకు డిమాండ్

మంచిర్యాలక్రైం: ఉన్నతాధికారుల వేధింపులతో మనస్తాపం చెందిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఆత్మహత్యాయత్నం చేయడం జిల్లాలో చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయంలో సోమవారం అటవీ శాఖ ఉన్నతాధికారులు, యూనియన్ నాయకులు సమావేశం కానున్నట్లు సమాచారం. మరోవైపు బాధితురాలు లత ఇంకా కోలుకోలేదు. లత ఆత్మహత్యాయత్నానికి కారణమైన ఎఫ్‌ఆర్వో రవి, క్లర్క్ ఖరీం, సెక్షన్ ఆఫీసర్ రాందాస్‌ను సస్పెండ్ చేయాలని మహిళా ఆఫీసర్లు ఇప్పటికే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న యూనియన్ నాయకులు ఎఫ్‌ఆర్వోను కాపాడేందుకు రంగంలోకి దిగినట్లు సమాచారం. ఇదిలా ఉండగా సీఎఫ్‌వో, డీఎఫ్‌వో రెండు రోజులుగా అందుబాటులో లేరు.

యూనియన్ నాయకుల జోక్యం...

ఎఫ్‌ఆర్వో రవి, సెక్షన్ ఆఫీసర్ రాందాస్, క్లర్క్ ఖరీం వేధింపులు భరించలేక ఈనెల 8న రాత్రి బీట్ ఆఫీసర్ లత ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ ఘటనపై కేసు పెట్టొద్దని యూనియన్ నాయకులు, కొందరు అధికారులు లతపై ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. నిందితుడు రవి కోసం కొంతమంది యూనియన్ నాయకులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఘటన జరిగి మూడు రోజులైనా కేసు నమో దు కాకపోవడం వెనుక యూనియన్ నాయకులు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

వివాదాస్పద ఎఫ్‌ఆర్వో..

ఎఫ్‌ఆర్వో రవి కోటపెల్లి రేంజ్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఏడేళ్లుగా తిష్టవేశాడు. బదిలీ అయినా.. ఉన్నతాధికారులు ముడుపులు ముట్టజెప్పి తిరిగి ఇక్కడే పోస్టింగ్ ఇప్పించుకున్నారని సమాచారం. ఇక, మహిళా అధికారులను వేధించడం, అసభ్యకరంగా వ్యవహరించడం రవికి అలవాటే అన్న ఆరోపణలు ఉన్నాయి. లత ఆత్మహత్యాయత్నం తర్వాత మరి కొందరు బాధితులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. రవి ఆగడాలపై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరినట్లు సమాచారం.



జిల్లా అటవీ శాఖ సీఎఫ్‌ఓ కార్యాలయం

నేడు కీలక సమావేశం..

బీట్ ఆఫీసర్ లత ఆత్మహత్యాయత్నం నేపథ్యంలో ఉన్నతాధికారులతో సమావేశం కావాలని యూనియన్ నాయకులు నిర్ణయించారు. ఇందులో ఆత్మహత్యాయత్నానికి కారణాలపై లోతుగా చర్చించే అవకాశం ఉంది. నిష్పక్షపాతంగా విచారణ జరిగితే రవిపై చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. కానీ యూనియన్ నాయకుల ఒత్తిడికి తలొగ్గితే లతతోపాటు, రవి బాధితులకు అన్యాయం జరుగుతుందని ఆశాఖ ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

సమష్టిగా సమస్యలు పరిష్కరించుకుందాం

- తెలంగాణ వయో వృద్ధుల సంక్షేమ సమాఖ్య అధ్యక్షుడు రాజలింగు



మాట్లాడుతున్న అధ్యక్షుడు రాజలింగు

మంచిర్యాలక్రైం: సమష్టి కృషితో సమస్యలు పరిష్కరించుకుందామని తెలంగాణ వయో వృద్ధుల సంక్షేమ సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు బొలిశెట్టి రాజలింగు, ప్రధాన కార్యదర్శి సైండ్ల మొండయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ అప్పటి కలెక్టర్ కర్ణన్ సహకారంతో వయో వృద్ధుల సంక్షేమ సంఘం ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. ప్రారంభంలో అధికారుల నుంచి ఆదరణ లభించిందని పేర్కొన్నారు. కరోనా తర్వాత వయోవృద్ధు సంక్షేమం నిరాదరణకు గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను కొత్త ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి సమష్టిగా పరిష్కరించుకుందామని తెలిపారు. ప్రతీ నెల సమస్యలపై చర్చించుకునేందుకు సమావేశం నిర్వహించాలని తీర్మానించారు. అనంతరం సమాఖ్య అభివృద్ధి కోసం, ఆర్థిక నిధులు సమకూర్చుకునేందుకు కావాల్సిన మార్గాలు తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పెద్దన్న, లచ్చన్న, కార్యవర్గ సభ్యులు, వృద్ధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీట్ ఆఫీసర్ ఆత్మహత్యా యత్నం బాధాకరం



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

కోటపల్లి: మండలంలోని వెంచపల్లి ఫారెస్టు బీట్ అధికారి లత ఆత్మహత్యాయత్నం చేసుకోవడం విచారకరమని ఐఎఫ్‌టీయూ మండల అధ్యక్షుడు మారుమల్ల సంపత్ అన్నారు. ఆదివారం కోటపల్లి ఫారెస్టు కార్యాలయం ఎదుట ఐఎఫ్‌టీయూ నాయకులు ఉద్యోగినిపై వేధింపులకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. కిందిస్థాయి ఉద్యోగులపై ఉన్నతాధికారుల తీరు మార్చుకోవలన్నారు. వేధింపులకు పాల్పడిన అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజన్న, పవన్, అరుణ్, సంపత్, లక్ష్మయ్య, చీకటి పాల్గొన్నారు.

12న ఉమ్మడి జిల్లా హాకీ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 12న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జోనల్ స్థాయి (ఉమ్మడి జిల్లా) బాలబాలికల హాకీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14, అండర్ 17 విభాగాల్లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన ఉమ్మడి జిల్లాలోని క్రీడాకారులు ఈ పోటీలకు హాజరుకావాలని తెలిపారు. కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, పోటీల ఆర్గనైజర్ జాదవ్ రవీందర్‌కు స్టేడియంలో రిపోర్ట్ చేయాలని సూచించారు.

నేడు గోదావరి మహాహారతి

జైపూర్: మండలంలో ప్రసిద్ధిగాంచిన వేలాల శ్రీమల్లన్న స్వామి ఆలయం నుంచి గోదావరి నది వరకూ సోమవారం సాయంత్రం 6గంటలకు గోదావరి మహాహారతి (గంగాహారతి) కార్యక్రమం నిర్వహించనున్నట్లు గోదావరి మహాహారతి మండల కన్వీనర్ డేగ నగేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమీప ప్రాంత భక్తులు అధిక సంఖ్యలో హాజరై గోదావరి మహాహారతి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

యువకుడి ఆత్మహత్య



ఆదె గోపాల్(ఫైల్)

వాంకిడి: పురుగుల మందు తాగి యువకుడు మృతిచెందిన సంఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం... ఖిరిడి గ్రామానికి చెందిన ఆదె గోపాల్(25) సరాండి గ్రామానికి చెందిన జానుబాయితో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వ్యవసాయ పనులు చేస్తూ అప్పుడప్పుడు మద్యం తాగేవాడు. భార్య మద్యం తాగొద్దని పది రోజుల క్రితం గొడవ పడి తన బిడ్డతో పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ నెల 5వ తేదీన భార్యను తీసుకొద్దామని సరాండి గ్రామానికి వెళ్లాడు. దీంతో మొహర్లే బడిరాం, బామ్మర్దులు జ్ఞానేశ్వర్, కిషన్‌తో పాటు అతడి భార్య దాడికి పాల్పడ్డారు. దీంతో అక్కడి నుంచి వచ్చిన గోపాల్ తండ్రి శంకర్‌కు విషయం తెలిపాడు. అదే రోజు సాయంత్రం శంకర్ కుల పెద్దల వద్దకు జరిగిన విషయం చెప్పే క్రమంలో గోపాల్ భార్య తన ఇద్దరు సోదరులతో వచ్చి బెదిరింపులకు గురిచేసింది. మనస్తాపానికి గురైన గోపాల్ పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.



జనసంద్రంగా కంకలమ్మ గుట్ట





మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

దీవించు తల్లీ..



గుట్టపై దీపాలు వెలిగిస్తూ..

శివసత్తుల పూనకాలు.. దేవతలకు మొక్కులు.. లేత బొంగుల ఊరేగింపు–వెదురు బొంగుల కళాకృతుల ప్రదర్శన.. తరలివచ్చిన భక్తులు.. నాటకాలు.. భజనలు.. సాంస్కృతి కార్యక్రమాలు.. కార్తీక మాసం ఆఖరు ఆదివారం కౌటాల మండల కేంద్రంలోని కంకలమ్మ గుట్ట (మేదరిగిరి)పై కంకలమ్మ– కేతేశ్వర స్వామి ఆలయ 19వ మహా జాతర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు ఇతర రాష్ట్రాల భక్తులు సైతం తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయ కమిటీ చైర్మన్ సుల్వ కనకయ్య– కళ్యాణి ఆధ్వర్యంలో వేదపండితులు రాధాకృష్ణ శర్మ, శివరాం స్వామి, తులసిరామేశ్వర్ స్వామి ఆధ్వర్యంలో పూజలు చేశారు. సిర్పూర్(టి) ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆసిఫాబాద్ జిల్లా ఏఎస్పీ(అడ్మిన్) అచ్చేశ్వర్‌రావు, కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. – కౌటాల



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సభ్యులు



కొబ్బరికాయలతో మొక్కులు..



కంకలమ్మకు పట్టు వస్త్రాలతో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు



సామగ్రి కొనుగోలు చేస్తూ..



కంకలమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, మాజీ ఎమ్మెల్యే రాజలక్ష్మి



జాతరలో భక్తులు...

ఈ విజయం ప్రజలందరిదీ

- అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా
- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



స్వాగతం పలుకుతున్న కేస్లాపూర్ గ్రామస్తులు

ఇంద్రవెల్లి: ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలువడం.. ప్రజల విజయమేనని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. ఎమ్మెల్యేగా గెలుపొంది ఆదివారం రాత్రి ముందుగా మండలంలోని కేస్లాపూర్ గ్రామంలోని నాగోబా ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. కేస్లాపూర్ గ్రామంలో సంప్రదాయ వాయిద్యాల మధ్య ఘన స్వాగతం పలికారు. శాలువలతో సన్మానం చేశారు. అక్కడి నుండి ముత్నూర్ చేరుకుని కుమురంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం వద్దకు చేరుకుని నివాళులర్పించారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి ఇంద్రాదేవి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల మత బేధాలు లేకుండా అన్ని వర్గాలను సమానంగా చూడడంతో పాటు ఖానాపూర్ నియోజకవర్గం సమస్యలను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించి అభివృద్ధి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ పెద్దలు మెస్రం వెంకట్‌రావ్, మెస్రం నాగ్‌నాథ్, మెస్రం ఆనంద్‌రావ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముఖడే ఉత్తం, ఎండి జహిర్, ఎండీ మసూద్ ఉన్నారు.

మాతోనే మెరుగైన వేతనాలు

- బీఎంఎస్ వేజ్ బోర్డ్ సభ్యుడు కె.లక్ష్మారెడ్డి



మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

శ్రీరాంపూర్: మా కృషి ఫలితంగానే 11వ వేజ్‌బోర్డులో మెరుగైన వేతన ఒప్పందం జరిగిందని బీఎంఎస్ బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జి, వేజ్ బోర్డు సభ్యుడు కొత్తకాపు లక్ష్మారెడ్డి తెలిపారు. ఆదివారం నస్పూర్ కాలనీలోని ఆంజనేయస్వామి కళ్యాణ మండపంలో నిర్వహించిన డివిజన్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 19 శాతం వేతనాల పెంపు ఇతర అలవెన్సుల పెరుగుద బీఎంఎస్‌తోనే సాధ్యమైందన్నారు. ఇటీవల సీఎంపీఎఫ్‌లో జరుగుతున్న ఆర్థిక అవకతవకలను ప్రక్షాళన చేస్తున్నామన్నారు. దీనిపై ఆ శాఖ అధికారులతో చర్చిస్తూ వారిపై ఒత్తిడి తెస్తున్నామన్నారు. కార్మికులకు కొత్త హక్కులు, సదుపాయాలు కావాలంటే రానున్న ఎన్నికల్లో బీఎంఎస్‌ను గెలిపించాలన్నారు. తాము ఒంటరిగానే పోటీ చేస్తున్నామని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు గుర్తింపు సంఘం ఎన్నికలను ఆపాలని కోరిన 12కార్మిక సంఘాల నేతలు ఇప్పుడు ఎలా ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు.

ఎన్నికల ఇన్‌చార్జిల నియామకం..

శ్రీరాంపూర్‌లో ఎన్నికల ఇన్‌చార్జిగా ఏబీకేఎంఎస్ కార్యదర్శి పులి రాజిరెడ్డి, తెలంగాణ కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడు చవ్వ మహేశ్, ఇన్‌చార్జిలకు సలహాదారులుగా నాతాడి శ్రీధర్‌రెడ్డిలను నియమించారు. దీనితో పాటు జేబీసీసీఐ స్టాండ్రడైజేషన్ కమిటీ సభ్యుడిగా యాదగిరి సత్తయ్యను నియమించారు. ఈ సందర్భంగా సుమారు 20 మంది కార్మికులు బీఎంఎస్‌లో చేరారు. బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, ఏబీకేఎంఎస్ కార్యదర్శులు మండ రమాకాంత్, రాజిరెడ్డి, యూనియన్ సెంట్రల్ కార్యదర్శి కాసెట్టి నాగేశ్వరరావు ఉన్నారు.



ఘనంగా షష్టి బోనాలు



షష్టి బోనాలు మండలంలో ఘనంగా నిర్వహించుకుంటున్నారు. గొల్లకుర్మలు ఆదివారం ఒగ్గు కళాకారుల డమరుక చప్పుళ్ల మధ్య మల్లన్న దేవుడికి బోనం పోశారు. ఈ సందర్భంగా ప్రాణహితలో పుణ్యస్నానాలకు భక్తులు తండోపతండాలుగా తరలివెళ్లారు. నదిలో పుణ్యస్నానాలు చేసి ఇసుక లింగాలను ఏర్పాటు చేసి పూజలు చేశారు. పాయసం తయారుచేసి దేవుడికి నైవేద్యం సమర్పించారు. ఏ ఊరిలో చూసినా బోనాల సందడి నెలకొంది. – వేమనపల్లి

అబ్జర్వేషన్ కమిటీ రాష్ట్ర చైర్మన్‌గా నియామకం



మణిచరణ్

ఖానాపూర్: సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ అబ్జర్వేషన్ కమిటీ తెలంగాణ చైర్మన్‌గా మండలంలోని బీర్నంది పంచాయతీ పరిధిలోని రంగపేట గ్రామానికి చెందిన కట్కం మణిచరణ్ నియామకమయ్యారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని అబిడ్స్‌లో నిర్వహించిన సమావేశంలో ఆ సంఘం జాతీయ చైర్మన్ కొప్పుల విజయ్, ప్రధాన కార్యదర్శి మామిడాల మనోహర్‌ల చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు.

గుర్తింపు ఎన్నికల్లో సీఐటీయూని ఆదరించాలి

రామకృష్ణాపూర్: త్వరలో నిర్వహించే సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికులు సీఐటీయూ యూనియన్‌ను ఆదరించాలని ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి నాగరాజుగోపాల్ అన్నారు. పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఇప్పటివరకు గుర్తింపు సంఘాలుగా పనిచేసిన అన్ని యూనియన్లు కార్మికుల సమస్యలను ప్రక్కనబెట్టి కేవలం పైరవీలకే పరిమితమయ్యాయని అన్నారు. ఇన్‌కంటాక్స్ రద్దు కోసం ఏ గుర్తింపు సంఘం కూడా చిత్తశుద్ధితో పనిచేయలేదన్నారు. కార్మిక శ్రేయస్సే ధ్యేయంగా పనిచేసే తమ సంఘానికి ఈ సారి అవకాశం కల్పించాలని కోరారు. బ్రాంచ్ అధ్యక్షుడు వెంకటస్వామి, అల్లి రాజేందర్, ఐలయ్య, సంజీవ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న సభ్యులు

సాక్షి ముంబై: మానవత్వం పరిమళించింది. ఓ నిరుపేద కుటుంబాన్ని 'ముంబై తాడ్‌దేవ్ అనే వాట్సాప్ గ్రూపు సభ్యులు ఆదుకున్నారు. సభ్యులందరూ కలిసి రూ.24వేలు పోగు చేసి ఇటీవల మృతి చెందిన అయిల్ల సత్తయ్య కుటుంబీకులకు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం రెబ్బెనపల్లి గ్రామానికి చెందిన అయిల్ల సత్తయ్య ముంబై తాడ్‌దేవ్‌లో ఇంటి పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఏడాది కిందటే అతడి భార్య మృతి చెందడంతో ఇద్దరు పిల్లలను స్వగ్రామంలో తల్లి వద్ద ఉంచి ముంబైలోనే పనులు చేస్తున్నాడు. సత్తయ్య సైతం అనారోగ్యంతో మృతి చెందడంతో అతడి భౌతికకాయాన్ని స్వగ్రామాన్ని తరలించేందుకు ముందుగా సహాయం అందించిన ఈ గ్రూపు సభ్యులు అనంతరం తల్లిదండ్రులు కోల్పోయిన పిల్లలిద్దరికీ రూ.24వేలు అందించినట్లు గ్రూపు సభ్యుడు ఎనగందుల లక్ష్మణ్ తెలిపారు.

43ఏళ్ల తర్వాత కలుసుకున్నారు...



సమ్మేళనానికి హాజరైన ఉపాధ్యాయులు, విద్యార్థులు

రామకృష్ణాపూర్: అదో అపూర్వ ఘట్టం.. అంతులేని ఆనందం... 43ఏళ్ల అనంతరం ఆవిష్కృతమైన అమోఘ సమ్మేళనం. రామకృష్ణాపూర్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం కనుల పండువగా సాగింది. పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై సీనియర్ ఉపాధ్యాయులతో జ్యోతిప్రజ్వలన గావించి సమ్మేళనాన్ని ప్రారంభించారు. 1979–80, 1980–81 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఈ సమ్మేళననానికి హాజరయ్యారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ తన్మయత్వం చెందారు. ఈ సందర్భంగా సీనియర్ ఉపాధ్యాయులు నారాయణ, కృష్ణమూర్తి, రాంచందర్ మాట్లాడారు. తమ జీవిత చివరి దశలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని విద్యార్థులు ఇంతకన్నా తమకిచ్చే గురుదక్షిణ మరోటి ఉండదన్నారు. పూర్వ విద్యార్థులు ఎస్.ప్రశాంత్, రామన్న, లక్ష్మణ్, శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

సంస్థ పరిరక్షణే ఏఐటీయూసీ ధ్యేయం



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

కాసిపేట: నిరంతరం కార్మికుల హక్కుల రక్షణ, సింగరేణి సంస్థ పరిరక్షణ ధ్యేయంగా ఏఐటీయూసీ పోరాటం చేస్తోందని ఏఐటీయూసీ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ మిట్టపల్లి వెంకటస్వామి తెలిపారు. ఆదివారం మందమర్రి ఏరియాలోని సోమగూడెం కమ్యూనిటీహాల్‌లో ఏఐటీయూసీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు, సంస్థ మనుగడకు సుదీర్ఘ పోరాటాలు చేసిన చరిత్ర ఏఐటీయూసీకి మాత్రమే ఉంటుందని, ఈ నెల 27న జరిగే గుర్తింపు సంఘం ఎన్నికల్లో భారీ మెజార్టీతో ఏఐటీయూసీని గెలిపించుకోవాలని కోరారు. సర్కారు సంఘం అని నమ్మి ఇప్పటి వరకు గుర్తింపు సంఘంగా ఉన్న టీబీజీకేఎస్‌ను గెలిపిస్తే కేవలం పైరవీలకు మాత్రమే పరిమితమైందని విమర్శించారు. కార్మికుల సమస్యలు పట్టించుకోకుండా సింగరేణిలో రాజకీయ జోక్యం పెంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి సొమ్మును ప్రభుత్వం దోచుకుంటు వేతనాలు చెల్లించలేని పరిస్థితికి తీసుకొచ్చి కనీసం ప్రశ్నించే ధైర్యం చేయకపోవడం బాధకరమన్నారు. చొప్పరి శ్రీహరి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బ్రాంచి ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, బ్రాంచి ఉపాధ్యక్షుడు బియ్యాల వెంకటస్వామి, నాయకులు మినుగు లక్ష్మినారాయణ, నాగేశ్వరరావు ఉన్నారు.

గెలిస్తే ఇంటి స్థలం ఇప్పిస్తాం

- ఐఎన్టీయూసీ నాయకులు



మాట్లాడుతున్న ఐఎన్టీయూసీ నాయకులు

శ్రీరాంపూర్: గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఐఎన్టీయూసీని గెలిపిస్తే కార్మికులకు రెండు గుంటల ఇంటి స్థలం ఇప్పిస్తామని ఆ యూనియన్ నాయకులు తెలిపారు. ఆదివారం నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆ యూనియన్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేని శ్యామ్, తిరుపతి రాజు మాట్లాడారు. ఇంటి స్థలంతో పాటు రూ.25లక్షల వడ్డీ లేని రుణం ఇప్పిస్తామని తెలిపారు. కార్మికులకు పెర్క్స్‌పై పడే ఆదాయపన్ను కంపెనే చెల్లించే విధంగా ఒప్పందం చేయిస్తామన్నారు. కొత్త గనులు తీసుకువచ్చి నిరుద్యోగులకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. సింగరేణిలో 25 కొత్తగనులకు సంబంధించి కంపెనీ అనుమతుల కోసం కేంద్రానికి దరఖాస్తు చేసుకుందని, వీటిని మోదీ ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నం చేస్తోందని, దీనిని అడ్డుకోవాలంటే సింగరేణిలో ఐఎన్టీయూసీ గుర్తింపు సంఘంగా గెలిచి ఉండాలన్నారు. సుమారు 40 కార్మికులకు సంబంధించిన అంశాలను మేనిఫెస్టోలో చేర్చామని గెలిచిన తర్వాత వీటన్నింటిని అమలు చేయిస్తామన్నారు. ఈ నెల 20న శ్రీరాంపూర్ లో ముఖ్యనేతల సమావేశం ఏర్పాటు చేస్తున్నామని, దీనికి తమ యూనియన్ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు హాజరవుతున్నారు. కార్యక్రమంలో యూనియన్ కేంద్ర డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు గరిగే స్వామి, ఐరెడ్డి తిరుపతిరెడ్డి, కేంద్ర కార్యదర్శులు సమ్మి రాజయ్య, మోతె రాఘవరెడ్డి, జాతీయ సమితి నాయకులు భీంరావు, నాయకులు రావుల అనిల్, బుస్స రమేష్, కొలిపాక సమ్మయ్య, ప్రవీణ్ పాల్గొన్నారు.